# మిస్టర్ నర్సింగ్‌హోం

మేము వెళ్లేటప్పటికి హాలు నిండిపోయింది. ఎవరో పెద్దమనిషి మమ్మల్ని గుర్తుపట్టి ముందుకు తీసుకెళ్లి కుర్చీలువేసి కూర్చోపెట్టాడు. అప్పుడే ముహూర్త సమయం కూడా అవడంచేత కళ్యాణమంటపం చుట్టూరా వీడియోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు వివిధ భంగిమల్లో నిలబడి దడి కట్టేశారు. అటు చూసేదేమీ లేక వెనక్కి తిరిగి ఆహ్వానితుల్ని చూసి నమస్కారాలతోనూ, కరచాలనాలతోనూ, చిరునవ్వులతోనూ, సౌంజ్ఞలతోనూ, పలకరింపులతోనూ రెండు నిముషాలు నేనూ, మా ఆవిడ గడిపేటప్పటికి.... బాండ్, మంగళవాద్యాల కలగలుపు హోరు ఆగింది. ఆ దడి కూడా సడలింది. మహోజ్వలంగా వెలుగుతున్న దీపకాంతుల మధ్య అప్పుడే కూర్చుని ఊపిరి పీల్చుకుంటున్న వధూవరులు, వాళ్లతల్లితండ్రుల మొహాలు జాజ్వల్యమానంగా వెలిగిపోతుండగా, ఆహ్వానితులందరూ లేచి వెళ్లి అక్షింతలు వేస్తున్నారు. మరీవెనకాల ఉన్నవాళ్లు ఈ జనసందోహంలో ముందుకొచ్చే సహనం లేక అక్కణ్ణుంచే విసిరిన అక్షింతలు ముందు వరుసలవాళ్ల తలలమీద పడుతున్నాయి. రఘు ఐజిపి. వెళ్ళింది వాడి కూతురి పెళ్ళికి.

అందరినీ పక్కనే ఉన్న హాల్లో భోజనాలకి రమ్మని ఆహ్వానిస్తుండగా, మేమిద్దరం కూడా కాస్త జనం పల్చబడ్డాక వెళ్లి వధూవరులను ఆశీర్వదించి, వాళ్లతల్లితండ్రుల్ని అభినందించి హాలువైపు నడుస్తున్నాం. అప్పుడు మైక్‌లో ఓ ప్రకటన వినపడింది. "మంగళసూత్ర ధారణకిముందు, తెలుగు పండితులు, కవీశ్వరులుశ్రీ నరసింహంగారు వధూవరుల నాశీర్వదిస్తూ రెండు నిమిషాలు కవితా గానం చేస్తారు. ఆసక్తి ఉన్నవారు విని ఆనందించగలరని ఆశిస్తున్నాం!" అని. ఎవరూ వెనక్కి తిరిగినట్టు లేదు. డైనింగ్ హాల్‌వైపే నెట్టుకు వెడుతున్నారు. మా ఆవిడ మాత్రం అమాంతంగా దార్లో ఓ ఖాళీ కుర్చీలో చతికిలబడి నా చెయ్యి పట్టుకు లాగి పక్క కుర్చీలో నన్ను కూలేసింది.

"ఇప్పుడా కవిత్వం అంతా వింటావా?" అని అడిగాను చిరాగ్గా.

"ఉష్!" అందితన ఏకాగ్రతకు భంగం కలిగించొద్దన్న ధోరణిలో.

మా ఆవిడ ఒక కవయిత్రి. ఈ రకం సాహిత్య వ్యాసాయంలో అగ్రశ్రేణి తారల్లో ఒకర్తిగా గుర్తింపు సంపాదించింది. ఈ రంగంలో ఈవిణ్ణెరగనివాళ్లు లేరు. మా ఇంటిపేరు 'పిల్లలమర్రి.' మా ఆవిడపేరు రంజని. నాపేరు గిరి. మొదటి అక్షరాలన్నీ కలిపి, వెరసి షార్టుగా 'పిరంగి' అన్న కలం పేరుతో వర్ధిల్లుతోంది.

ఆ పండితుడు ఏ మేకప్పూ లేకుండా కుచేలుడు వేషానికి పనికొస్తాడు. కంఠం మాత్రం గంభీరంగా ఉంది. ఎవరు వినకపోయినా ఫరవాలేదన్నట్లు యాంత్రికంగా, ఒక్కొక్క లైను రెండేసి సార్లుచదువుతూ తన పాండిత్యానికి తనే సంబరపడుతూ పూర్తి చేశాడు.

"ఆయన చాలా మంచి కవి. చిన్నప్పటి మా తెలుగు మాస్టారు!" అంది రంజని తన్మయత్వంతో.

"పద, పద! భోంచేసి బయటపడదాం. ఆ డైనింగ్ హాల్లో కూడా పెద్దక్యూ ఉంటుంది!" అన్నాను లేస్తూ.

"మీరో చిన్న పని చెయ్యండి..."ఏదో చెప్పబోయింది.

"భోజనం తప్ప ఏమీ చెయ్యను!" అన్నాను లేచి అడుగులేస్తూ.

"వెళ్లి మీ పక్కనే నా కో కుర్చీ రిజర్వ్ చేయండి. బఫే కాదుట, ఆకుల్లో వడ్డన!" అనేసి కళ్యాణవేదికవైపు వెళ్లింది.

డైనింగ్ హాల్లో సుమారు మూడువందల మంది ఫస్ట్ బాచ్‌లో కూర్చుని భోంచేస్తున్నారు. ఇంక ఖాళీ లేక ఓ వందమంది వెయిటింగ్‌లో ఉన్నారు. ఇంతలోనే సూత్రధారణ కూడా అయిపోయినట్టు మంత్రాలు, మంగళవాద్యాల జోరు నిలిచింది. దాంతో మరో జనతరంగం తోసుకొచ్చింది. వాళ్లతోబాటే రఘు భార్య- దుర్గ మా ఆవిణ్ణి వెంటబెట్టుకొచ్చింది. అప్పటే ఒక్కొక్క వరసే ఖాళీ అవడం, బల్లలమీద ఉన్న ఎంగిలాకుల కాగితాల చుట్టల్ని తీసెయ్యడం, కొత్త కాగితం, ఆకులు పరచడం జరుగుతోంది. ఖాళీ అయిన కుర్చీల్లో అతిథులు కూర్చుంటున్నారు. మేము నిలబడ్డచోటుకి దగ్గరగా ఉన్న టేబుల్ ఖాళీఅయింది. దాని ముందున్న కుర్చీల్లో ఒకదానిమీద ఇందాకటి కవిగారు కూర్చోబోతుంటే, "ఉండండి, మేస్టారూ! మీకు తొందరేమొచ్చింది?" అని దుర్గ అనడం విని, ఆయన లేచి వెనక్కి వెళ్లాడు.

"ముందు మీ రిద్దరూ కూర్చోండి!" అని మా వంక తిరగ్గానే, "అబ్బెబ్బే! ఏమీ అనుకోకు, దుర్గా! మేము భోజనానికి ఉండటంలేదు. ఇంట్లో ఇద్దరు అతిథులున్నారు. వాళ్లసలే మొహమాటస్తులు, ముహూర్తం అవగానే వచ్చేస్తామని మాటిచ్చాం. ముందే చెబితే ఏం గందరగోళం చేస్తావోనని చడీ చప్పుడూ లేకుండా జారుకుందామని, ఈయన్ని వెతుక్కుంటూ ఇక్కడికొచ్చాను!" అంది, రంజని నా చెయ్యి చిల్లుపడేలాగా గిల్లుతూ.

గత్యంతరం లేక నేనూ తందాన తానా అన్నాను చెయ్యి రుద్దుకుంటూ.

"నాన్‌సెన్స్! మా అమ్మాయి పెళ్లికొచ్చి భోజనం చెయ్యకుండా వెళ్లిపోతారా! ఆల్‌రైట్, రంజనీ! ఓ పని చెయ్యి. ఒక్క నిముషం ఆగు, కారియర్‌లో భోజనం పెట్టించి పట్టుకొస్తాను!

ఇంటికి పట్టుకెళ్లిమీ అతిథులతో తినండి. కాస్త ఆ మాత్రం మర్యాదైనా దక్కించు!" అని దుర్గ ఇంక మారు మాట్లాడటానికైనా అవకాశం ఇవ్వ కుండా గిరుక్కున తిరిగి లోపలికెళ్లింది. సంగతేమిటో కనుకుందామనుకుంటుంటే-

"ఇప్పుడే వస్తాను, ఈ స్తంభం దగ్గర నిలబడండి!" అని చెప్పి రంజని చూస్తుండగా మరోవైపు అంతర్ధానమైంది.

"ఏమిటిక్కడ నిలబడ్డారు?" అని తెలుసున్నవాళ్లు పలకరిస్తుంటే ఏదో అర్థం లేని సమాధానం చెప్పలేక విసుగెత్తిపోయింది. కార్లో కూర్చుని వెయిట్ చెయడానికి అవకాశం లేదు. వచ్చింది మా ఆవిడ కార్లో కనుక, తాళాలు నా దగ్గర లేవు. ఇలా అయోమయ స్థితిలో ఉండగా, ఎట్టకేలకు పది నిముషాలయ్యాక ఓ పోలీస్ కానిస్టేబుల్ ఓ కేరియర్, రెండు ప్లాస్టిక్ సంచీలు చేత్తో పట్టుకుని వెనకాల వస్తూండగా, ఇటు దుర్గా, మరోవైపు నుంచి రంజని ప్రత్యక్షమయ్యారు.

కార్లో కూర్చుంటుండగా, అప్పటికే వెనక సీట్లో కూర్చుని ఉన్న ఆ తెలుగు మాస్టార్ని రంజని నాకు పరిచయం చేసింది. డైనింగ్ హాల్లో ఒక్క క్షణంలో ప్లేటు ఎందుకు ఫిరాయించిందో నాకప్పుడర్థమైంది. ఆయనకిలాంటి చిన్న చిన్న అవమానాలూ, మధ్యమధ్య పస్తులుండటాలూ అలవాటేట. ఈ మధ్య రక్తపుపోటు ఎక్కువై గుండె బలహీనపడిందట. ఆయన విషాద గాథ కార్లో చెప్పాడు. చెట్టంత కొడుకు ఇంజనీరింగ్ కోర్స్ ఫైనలియర్‌లో ఉండగా బ్రెయిన్ కాన్సర్‌తో పోయాట్ట. బెంగతో భార్య పోయింది. తర్వాత వద్దన్నా వినకుండా ఉన్న కాస్త కొంపా అమ్మేసి, అప్పులు తీర్చి, మిగిలినదాంతో బియ్యే పాసైన కూతురికి పెళ్లి చేశాడు. రెండేళ్లు అయ్యేసరికి అల్లుడి దుర్మార్గానికి విసుగెత్తి విరక్తితో కూతురు కిరసనాయిల్ పోసుకుని అంటించుకుని పోయిందట. నాకా మాటలు వింటుంటే ఆ అమ్మాయి మీద ఒళ్లు మండింది. చదువూ, సంస్కారమూ ఉన్న అమ్మాయి ఆత్మహత్య చేసుకోవడమేమిటి! అదా తన సమస్యకి పరిష్కారం! పోనీ, ఎలాగా పోదల్చుకున్నప్పుడు మరో లీటర్ కిరసనాయిల్ కొని మొగుడు నిద్రపోగా చూసి వాడిమీద కూడా పోసి నిప్పంటించుకుని సహదహనం చేసుకుంటే, విధం చెడ్డా ఫలం దక్కినట్టు ఆ మొగుడుగాడూ చస్తాడు, అలాంటి మొగుళ్లకీ బుద్ధొస్తుంది.

"మాస్టారూ! మీ రిప్పుడేం చేస్తున్నారు?" అని అడిగాను ఆ నర్సింహంగార్ని.

"ఇప్పుడీ వయస్సులో చేయగలిగిందేముంది, నాయనా? ఈ మధ్య ట్యూషన్లు కూడా లేవు. అడపాతడపా మనస్సు చిక్కబట్టుకుని కవితలు రాసి నాకు తెలుసున్న పత్రికలకు పంపుతూ, ఉంటే తింటూ, లేకపోతే పస్తుంటూ చావలేక, చావు రాక బతుకుతున్నాను!"

"మీకీ పెళ్లివారితో ఎలా పరిచయం...."

"నా కక్కడ ఎవరూ తెలియదు. వారం రోజుల క్రితం చిన్నప్పుడు నా దగ్గర చదువుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చి వాళ్లను గురించి చెప్పి నాలుగు పద్యాలు రాసి చదవమని అడిగాడు. కాదనలేకపోయాను. అతనే కూడా తీసుకొచ్చాడు!" అన్నాడాయన.

మా ఇంట్లోనే ముగ్గురం పెల్లి భోజనం చేస్తుండగా, మాస్టారు, రంజనీ పరస్పరం వాళ్లవాళ్ల కవితల్ని ప్రశంసించుకుంటుంటే నేను మౌనంగా మాస్టారిని గురించి ఆలోచిస్తున్నాను. ఆయనకి అరవయ్యేళ్ళుంటాయి. పండితుడు, కవి, ఉపన్యాసకుడు కూడానట. నిజమే ఆయన ఎన్నో కష్టాలను భరించాడు. జీవితం చాలా విలువైనది. నిరాశ మనిషికి శత్రువు. ఎంతటి విషాదకరమైనా ఇంతటి విద్యావంతుడు తన జీవితానికి ఒక ప్రయోజనం, పరమార్థ లేదనుకోవడం దురదృష్టకరం.

మాస్టారికి ఏ సన్మానాలూ, సత్కారాలూ, పురస్కారాలూ అందించకపోవడం మహా ఘోరపాతకమని, సాహితీ సంస్థలన్నిటినీ మా ఆవిడ దుయ్యపట్టింది. "నాకంతటి పరిచయాలూ, పలుకుబడీ, ఆర్థిక స్తోమతా, రాజకీయ విజ్ఞతా లేనప్పుడు అవి ఆశించడం అవివేకమే అవుతుంది!" అన్నాడాయన.

అంతవరకూ నేనూ ఒప్పుకుంటాను. ఎంచేతనంటే ఈ అర్హతలన్నీ మా ఫిరంగికున్నాయి. వారానికి రెండు మూడుసార్లయినా ఎక్కడో అక్కడ దళితవాదమనో, స్త్రీ వాదమనో అతిథిగానో ఉపన్యాసకురాలుగానో వెడుతూ జ్ఞాపికలూ, పురస్కారాలూ, బిరుదులూ అందుకుంటూ ఉంటుంది. గదిలో కూర్చుని రాస్తుంది కానీ, ఈ స్త్రీలూ, దళితుల తాలూకు సమస్యల పరిష్కార సహాయోద్యమాల్లో మాత్రం తల దూర్చదు. "కలమే నా కత్తి" అన్నది కొత్త నినాదమేమీ కాదు.

★ ★ ★

రఘుని వారంరోజులు కార్డియాక్ ఇన్‌టెన్సివ్ కేర్ వార్డ్‌లో ఉంచి పరీక్షలన్నీ చేశాక వెంటనే ఏ ఆపరేషనూ అవసరం లేదని తేలింది. ఉదయం రౌండ్స్‌లో వాడున్న గదికొచ్చాను.

"గుడ్ మార్నింగ్, గిరి గారూ! ఈ మహానుభావుడికి 'బై పాస్' అంటారో, 'ఏంజియోప్లాస్ట్' అంటారో అని నా గుండెలు దడదడలాడాయి. రేపు డిశ్చార్జ్ చేస్తానన్నారుటగా! థాంక్స్! మీ హస్తవాసి మంచిది!" అందివాడి మంచంఅంచున కూర్చున్న దుర్గ.

"ఒరేయ్! నువ్వుడిశ్చార్జ్ చేసినా, నేను మాత్రం ఇక్కణ్ణుంచి వెళ్లను. ఈ గది కాకపోతే, మరో గది చూపించు, అక్కడ ఉంటాను!" అన్నాడు రఘు నా చెయ్యి సంతోషంగా అందుకుని.

"ఇక్కడాయన ఉండి మాకు హార్టెటాక్ తెప్పించక్కర్లేదు. ఆ తాగుడూ, పేకాటా, క్లబ్బూ, పార్టీలూ తగ్గించమనండి, చాలు!" అంది దుర్గ.

"తగ్గించడమేమిటి, మానేస్తాను. మీ 'మిస్టర్ నర్సింగ్ హోమ్' దగ్గర అప్రెంటీస్‌గా చేరతాను!" అన్నాడు రఘు.

"ఎవరండీ, మిస్టర్ నర్సింగ్‌హోమ్? ఈ రెండు రోజుల్లోనూ ఈయన్ని ఇంతగా మార్చేశాడు. పొద్దున్న నేనొచ్చేటప్పటికే కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్లిపోయాడుట. ఆయన జీవిత సత్యాల్ని కాచి వడబోసి శోధించిన త్యాగి, యోగి అంటూ ఈయన తెగ పొగిడేస్తున్నారు!" అంది దుర్గ.

"ఎవరో చూద్దువుగాని, రేపుదయం కొంచెం పెందరాళే వస్తే కలుసుకోవచ్చుగా!" అన్నాను దుర్గతో.

"ఇంతకంటే పెందరాళే మా ఆవిడ రాలేదు. తెల్లారగట్లే అలారం పెట్టుకుని తొమ్మిందింటికి లేస్తుంది!" అన్నాడు రఘు.

"ఇంకా పెందరాళే లేచి ఏం చెయ్యాలి? పొద్దున్న తొమ్మిదిన్నరకి మా అమ్మాయినీ, అల్లుణ్ణీ, మనవణ్ణీ ఫోనులో పలకరిస్తాను. మధ్యాహ్నం రంజనికీ, దానికి తీరుబడి లేకపోతే ఏ స్నేహితురాలికో ఫోన్‌చేసి వెంటబెట్టుకుని శిల్పారామం, ఫిల్మ్‌సిటీ, షాపింగూ, సభలూ, స్నేహితులూ.... సిటీలో కాలక్షేపానికి కరువా! సాయంత్రం భోజనం వేళకింటికి తిరిగొచ్చేస్తాను. రాత్రి ఇంటికి తిరిగొచ్చాక మా అమ్మాయే ఫోన్ చేస్తుంది. తర్వాత ఈయనగారు అర్ధరాత్రికి కానీ ఇంటికి రారు. అంతవరకూ టీవీ ప్రోగ్రాములూ.... ఇంతకంటే నేనేం చెయ్యాలి?" అంది దుర్గ. ఆమె దినచర్య వర్ణనలో ఏదో భర్తీ చేయలేని లోటూ, అసంతృప్తీ స్పష్టమవుతున్నాయి.

"చూడు, దుర్గా! ఇంతకంటే ఏం చెయ్యగలను అనుకోడానికి కారణం నీ దృష్టినీ, నీ ఆలోచనల్నీ, నీ కార్యకలాపాల్నీ మీ చిన్న కుటుంబం యోగక్షేమాలకే పరిమితం చేయడం. కొన్నాళ్లకీ జీవితం మీద విసుగెత్తుతుంది. వయస్సు పెరిగే కొద్దీ ఓపికా, ఉత్సాహం తగ్గుతాయి. నా వాళ్లనుకున్న బంధుమిత్రులందరూ మిమ్మల్ని దూరం చేస్తున్నారనే భావంతో బతుకు భారంగానూ, చావు భయంగానూ పరిణమిస్తాయి. ఇది జీవితానికో పరమార్థాన్ని నిర్ధారించుకోకపోతే కలిగే అనర్థం. చివరికి ఏదో ఒకనాడు మీలాంటివాళ్లు ఈ నర్సింగ్‌హోమ్‌లో చేరక తప్పదు!" అని ఓ చురక తగిలించాను.

"కరెక్ట్! సరిగ్గా అదే మాటన్నాడు మిస్టర్ నర్సంగ్ హోమ్! వ్యక్తి సమాజంలో ఓ భాగం. వ్యక్తి యోగక్షేమాలు సమాజ యోగక్షేమాలమీద ఆధారపడి ఉంటాయి. హృదయం విశాలం చేసుకుంటే ఈ సమాజమంతా ఒకే కుటుంబంలాగ అనిపిస్తుంది. నీ వ్యక్తిగత సౌఖ్యాల్నీ, సరదాల్నీ త్యజించక్కర్లేదు. దానికి తోడు నీ శక్తికొలదీ ఏదో విధమైన సమాజ సేవ చేసే వ్యాపకం కల్పించుకుంటే దాంట్లో నీకు ఆసక్తి పెరుగుతుంది. నీ జీవిత చరమ దశలో కావలిసినంత సంతృప్తీ, ఆనందమూ, మనశ్శాంతీ కలుగుతాయి! అంటూ ఆయన

దిచర్యంతా చెప్పాడు. మహానుభావుడికి చేతులెత్తి మొక్కాలి!" అన్నాడు రఘు. వాడి మాటల్లో హృదయస్పంధన ఉంది.

"ఒకప్పుడు పేషంట్‌గా ఈ నర్సింగ్‌హోమ్‌లో చేర్చుకున్నాను. ఈ రోజున ఈ నర్సింగ్‌హోమ్‌కి ఆయనమూలంగా కూడా ఎంతో మంచి పేరొచ్చింది. ఇక్కడనుంచి డిశ్చార్జ్ అయిన పేషెంట్లెంతోమంది నాకు కాకపోయినా, ఆయనకి కృతజ్ఞతలు చెబుతూ జాబులు రాస్తారు!" అన్నాను.

"ఆయన మీ నర్సింగ్‌హోమ్ కేర్‌టేకరా?" అడిగింది దుర్గ.

"ఆయన ఉద్యోగానికి పేరేమీ లేదు. చేరిన ఏడాది తిరక్కుండా మా డాక్టర్లందరూ కూడబలుక్కుని ఆయనకి 'మిస్టర్ నర్సింగ్‌హోమ్' అనే సార్థకమైన పేరు పెట్టారు. భోజనవసతి సదుపాయాలేర్పాటు చేసి ఏదో కొద్దిపాటి గౌరవ వేతనం ఇస్తాం. దాన్ని కూడా ఆయన పేదసాదల సహాయానికే వినియోగిస్తాడు!" అన్నాను.

"నిత్యం ఉదయం అన్ని గదుల్లోకీ వెళ్లి పరిశుభ్రతా, సదుపాయాలూ, నర్సింగ్ కేరూ గురించి సంతృప్తికరంగా ఉన్నాయా, లేదా అని తెలుసుకుంటాడు. తర్వాత రోగులతో పరిచయం చేసుకుని ధైర్యం, ఉత్సాహం, ఆత్మవిశ్వాసం కలిగించే మాటలు చెప్పి వెడతాడు. అందరినీ నవ్వుతూ పలకరిస్తాడు. సాయంత్రం ఒక స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న శరణాలయానికి వెళ్లి బాలబాలికలని ఉత్సాహపరిచే కథలూ, పాటలతో కాలక్షేపం చేస్తాడు. అది సరే, నువ్వాయన్ని పొగుడుతావు, ఆయన నిన్ను పొగుడుతాడు. ఇందులో ఎవరెవరికి గురువు?" రఘు అడిగాడు నన్ను.

"ఆయనకి తోవ చూపెట్టాను. ఆయన గమ్యం దిశగా చరచరా నడుస్తూ మా అందరికీ ఇప్పుడు మార్గదర్శి అయ్యాడు!" అన్నాను.

"అయితే రేపటినుంచి మీరు తాగుడూ, పేకాటా మానేసి ఆయన వెంట తిరుగుతారా?" దుర్గ అడిగింది, ఇదంతా స్మశాన వైరాగ్యమన్న ధోరణిలో.

"ఓయస్! ముందు ఆర్థిక సహాయం చెయ్యడం మొదలెడతాను. తర్వాతన నాకు తగ్గమార్గం ఆయనే చూపెడతాడు!" అన్నాడు రఘు.

"అసలు ఈ నర్సింగ్‌హోమ్‌గారికి పేరు లేదా? ఈయనతో మీకెలా పరిచయమైంది? ఈయనకి భార్యా బిడ్డలు లేరా?" అడిగింది దుర్గ.

"ఎనిమిదేళ్ల క్రితం మొట్టమొదటిసారిగా ఆయన్ని మీ అమ్మాయి పెళ్లిలోనే కలిశాను. మిగతా వివరాన్నీ ఆయన్ని రేపు కలుసుకున్నప్పుడు నీకే తెలుస్తాయి!" అన్నాను, లేచి బయటకు వెడుతూ.

** ఆంధ్రప్రభ, సెప్టెంబరు 1999*